సాక్షి
గుంటూరు
ఆదివారం । 18 । అక్టోబర్ । 2026





## చెరకు మద్దతు ధర ప్రకటన

ఉయ్యూరు(కంకిపాడు): 2026-27 సీజన్‌కు చెరకు టన్ను మద్దతు ధర రూ.3,783గా శనివారం రైతు సంఘాల ప్రతినిధుల సమావేశంలో కేసీపీ యాజమాన్యం ప్రకటించింది.



## పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుత నిల్వ 28.6360 టీఎంసీలు. ప్రాజెక్టు దిగువకు 400 క్యూసెక్కులు లీకేజీల ద్వారా వెళుతోంది.



## అత్యవసర వైద్యసేవలపై శిక్షణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ట్రామా రిజిస్ట్రీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమితా శంకర్ ఆధ్వర్యంలో అత్యవసర వైద్యసేవలపై శనివారం శిక్షణ ఇచ్చారు.

# ఏమీ కొనలేం.. తినలేం!

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
- నియంత్రణలో దారుణంగా విఫలమైన టీడీపీ ప్రభుత్వం
- పేద, మధ్యతరగతి వర్గాలపై పెరిగిన ఆర్థికభారం
- నెలవారీ ఖర్చులు భారీగా పెరగడంతో తప్పని కష్టాలు
- స్థానిక ఎన్నికలపై ప్రభావం తప్పదని కూటమి నేతల ఆందోళన



**గుంటూరు వెస్ట్:** రోజువారీ పని చేసుకునే పేదలు మొదలు మధ్యతరగతి కుటుంబాల వరకు నిత్యావసర వస్తువుల ధరల ప్రభావం ప్రజలపై పడుతోంది. ఈ రోజు ఉన్న సరుకుల ధర తెల్లారేటప్పటికీ మారిపోతోందంటే అతిశయోక్తి కాదు. చిన్న కుటుంబానికి నెలవారీ నిత్యావసర సరుకుల ఖర్చులో 25 నుంచి 35 శాతం వరకు వ్యత్యాసం వస్తోంది. ఇక బియ్యం విషయానికి వస్తే ధరలు ఊహకందని విధంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం కిలో బియ్యం ధర కనీసం రూ.80కి తక్కువ లేదంటే నమ్మాల్సిందే. ఇంత జరుగుతున్నా చంద్రబాబు సర్కారు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణను చాలా తేలికగా చూస్తోంది. ఏదో మొక్కుబడిగా సమీక్షలు నిర్వహించి, ఆదేశాలు జారీ చేసి చేతులు దులుపుకొంటోంది. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న అవస్థలను పట్టించుకోవడం లేదు. అయితే, ఎల్‌నినో ప్రభావంతో ధరలు పెరుగుతున్నాయని ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. అన్ని వర్గాల ప్రజలు ఈ విషయంలో చంద్రబాబు సర్కారుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. స్థానిక ఎన్నికల వేళ ఈ ప్రభావం తమ కొంప ముంచుతుందని కూటమి నాయకులు భయపడుతున్నారు.

### కొన్ని వస్తువుల ధరలు ఆకాశంలోనే

బియ్యంతోపాటు కందిపప్పు ధర కూడా భారీగా పెరిగింది. ఆరు నెలల క్రితం కిలో కందిపప్పు ధర రూ.110 ఉండగా, ప్రస్తుతం రూ.140కి చేరింది. మినపగుళ్ల ధర రూ.110 నుంచి రూ.140కి, పంచదార రూ.40 నుంచి రూ.70కి, బెల్లం రూ.40 నుంచి రూ.60కి, నూనె ప్యాకెట్ రూ.120 నుంచి రూ.170కి పెరిగాయి. ఇలా నిత్యావసర సరుకులతోపాటు పాలు, కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆకుకూరలు సైతం ప్రియంగా మారిపోయాయి. ఇటీవల రైతు బజార్లలో బియ్యం, ఉల్లిపాయలను తక్కువ ధరలకు విక్రయిస్తామని అధికారులు ఆర్భాటంగా ప్రకటించినా, ఆ కార్యక్రమం మూడు నాళ్ల ముచ్చటగానే ముగిసింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంతోపాటు విజిలెన్స్ దాడులను పెంచాల్సింది పోయి టీడీపీ సర్కార్ చోద్యం చూస్తోంది.

### సామాన్యుడి బతుకు భారం

ఆటో నడిపే వ్యక్తి నెలవారీ ఆదాయం సగటున రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకే ఉంటుంది. భార్య, ఇద్దరు పిల్లలను పోషిస్తూ, పిల్లలను చిన్నపాటి పాఠశాలలో చదివించినా పెరిగిపోతున్న సరుకుల ధరలు అతనికి అదనపు భారంగా మారుతున్నాయి. ఇక ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారి సంఖ్య సుమారు 8 వేల వరకు ఉంది. వీరికి నెలకు రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకే జీతం వస్తోంది. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియని దిక్కుతోచని పరిస్థితుల్లో వారు ఉన్నారు. కొద్దిపాటి సంపాదన ఉన్నవారికే పరిస్థితి ఇలా ఉంటే, ఉద్యోగం లేనివారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కూలీనాలీ చేసుకుని జీవించే వారి జీవన స్థితిగతులు అధ్వానంగా మారాయి.

### స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం

ధరల ప్రభావం ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులే భయపడుతున్నారు. ఇప్పటికే గ్రామస్థాయిలో ప్రజలు ధరల పెరుగుదలపై నాయకులను నిలదీస్తున్నారు. సోమవారం నుంచి నగరపాలక సంస్థల ఎన్నికల ప్రచారానికి ఎలా వెళ్లాలా అని కూటమి అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడతాయేమోనని భయపడుతున్నారు. దీనికితోడు గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇంతవరకు సరిగా అమలు కాకపోవడంతో టీడీపీకి సైతం నగరంలో కొన్ని చోట్ల అభ్యర్థులు కరువవుతున్నారంటే నమ్మాల్సిందే.

### కరోనా సమయంలోనూ ఇంత ఇబ్బంది పడలేదు



''ఏంటండీ, కిలో బియ్యం రూ.80నా? ఇక నూనె, ఇతర వస్తువుల ధరలైతే మరీ ఎక్కువగా ఉన్నాయి. మాది చిన్నపాటి సొంతిల్లు. అయినప్పటికీ నెలకు తక్కువలో తక్కువగా రూ.25 వేల నుంచి రూ.28 వేల వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. కరోనా లాంటి క్లిష్ట సమయంలో అప్పటి ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో డబ్బులు వేసి ఆదుకుంది. ప్రభుత్వం తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు అందించే విధంగా ప్రత్యేక స్టోర్లు ఏర్పాటు చేయాలి

– మామిడి ప్రియాంక, గృహిణి, గోరంట్ల



నామినేషన్ దాఖలు చేస్తున్న తాడికొండ శ్రీదేవి. పక్కన వీరాంజనేయులు

# ఆర్యవైశ్యులకు గౌరవం కల్పించిన వైఎస్ జగన్

- వైఎస్సార్ సీపీ మేయర్ అభ్యర్థి శ్రీదేవి నామినేషన్ దాఖలు
- ప్రజాభిమానంతో మేయర్‌గా విజయం సాధిస్తానని వెల్లడి

**గుంటూరు ఎడ్యుకేషన్:** గుంటూరు నగర మేయర్ స్థానానికి వైఎస్సార్ సీపీ తరఫున తాడికొండ అలివేలు వెంకట నాగ పద్మ శ్రీదేవి శనివారం నామినేషన్ వేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని నగరపాలక సంస్థ సర్కిల్ కార్యాలయంలో ఆమె రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం శ్రీదేవి మీడియాతో మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీలో ఆర్యవైశ్యులకు సముచిత గౌరవం కల్పించారని తెలిపారు. మేయర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పాలన, గుంటూరు నగర అభివృద్ధికి చేసిన కృషి తనను మేయర్‌గా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాభిమానంతో మేయర్‌గా విజయం సాధిస్తానని అన్నారు. కూటమి అధికారంలో ఉన్నప్పటికీ, ప్రజాభిమానం మెండుగా ఉన్నందున ధైర్యంగా పోటీలో నిలిచినట్లు చెప్పారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నేత, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు టీఎల్‌వీ వీరాంజనేయులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

### పార్టీలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం



పార్టీలో ఆర్యవైశ్యులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, వ్యాపారవేత్తలుగా సమాజ ఆర్థికాభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యాన్ని అందిస్తూ, భక్తిభావం మెండుగా ఉన్న ఆర్యవైశ్య సామాజిక వర్గానికి పార్టీలో తగిన గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో తాడికొండ శ్రీదేవిని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు నగర మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేశారని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా నియమితులైన టీఎల్‌వీ వీరాంజనేయులు సతీమణి అయిన శ్రీదేవికి సమాజంపై చక్కటి అవగాహన ఉందని అన్నారు. ఆర్యవైశ్యులను గౌరవించాలనే ఉద్దేశంతో తాడికొండ శ్రీదేవిని గుంటూరు మేయర్ అభ్యర్థిగా ప్రకటించారని, ఆర్యవైశ్య మహిళను మేయర్‌గా గెలిపించుకుంటామని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీతో కూడిన కూటమి నేతలు అభ్యర్థుల ఎంపికలో తలలు పట్టుకుంటున్నారని, వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను అధినేత వైఎస్ జగన్ ధైర్యంగా ప్రకటించారని అంబటి రాంబాబు అన్నారు.

## న్యూస్‌రీల్

### శిశు గృహానికి రిఫ్రిజిరేటర్ బహూకరణ



**గుంటూరు లీగల్:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు గుంటూరులోని శిశు గృహానికి రిఫ్రిజిరేటర్, స్టోరేజ్ బాటిల్, వాటర్ బాటిల్స్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ పి.వి.రాజీవ్‌లు శనివారం మేనేజర్ ఒలీవ చంద్రికకు అందజేశారు. ఓ కేసులో రూ.30 వేలను గుంటూరు న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. ఆ మొత్తాన్ని పిల్లల సంక్షేమం కోసం వినియోగించాలని ఆదేశించింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్, సిబ్బంది, శిశు గృహ సిబ్బంది పాల్గొన్నారు.

### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**గుంటూరు వెస్ట్:** స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఫిర్యాదులు స్వీకరించడంతోపాటు, ఎన్నికలకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసేందుకు స్థానిక కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 08632 234014 నంబర్‌ను సంప్రదించాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. వివిధ చానల్స్, కేబుల్ చానెల్, సినిమా హాల్ తదితర ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి అభ్యర్థులు మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ టీమ్‌కు కనీసం మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రింట్ మీడియా, సోషల్ మీడియాలో ప్రకటనలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఖర్చులు అభ్యర్థుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

### బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ



**గుంటూరు వెస్ట్:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సిబ్బంది పోలింగ్ విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. శనివారం స్థానిక ఏసీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్‌తో కలసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులకు సంబంధించి సిబ్బంది తమ సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. సంబంధిత ఎన్నికల మెటీరియల్‌ను క్షుణ్ణంగా చదివి, పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అశ్రద్ధకు తావులేకుండా, నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వ మహిళా కళాశాలలో జరుగుతున్న పోలింగ్ సిబ్బంది శిక్షణా తరగతులను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

### ధైర్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై ధైర్యలక్ష్మి అమ్మవారికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ధైర్యలక్ష్మి అమ్మవారికి ఉదయం అభిషేక మహోత్సవం, కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధైర్యలక్ష్మి అమ్మవారికి శ్రీయాగం వైభవంగా జరిగింది. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ధైర్యలక్ష్మి అమ్మవారికి పల్లకీ సేవ, అర్చన, నివేదన, మంగళాశాసనం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధైర్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కష్టాలను ఎదుర్కొనే శక్తి, కుటుంబంలో సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని ధైర్యలక్ష్మి అమ్మవారిని పూజిస్తారని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు అన్నారు.

# వైభవంగా శ్రీదేవీ నవరాత్రోత్సవాలు

**లలితా త్రిపురసుందరీదేవిగా భ్రమరాంబ దర్శనం**

**పెదకాకాని:** శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులను శనివారం అనుగ్రహించారు. శ్రీదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, హారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు, వేదపండితులు, స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, నవావరణార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు జరిపించారు. ఆలయ యాగశాలలో నిర్వహించిన చండీ, రుద్ర హోమ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాప్రసాద్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 5 గంటలకు ప్రవచనకర్త నోరి నారాయణమూర్తి దేవీభాగవతంపై ప్రవచనం చేశారు. విజయవాడ శ్రీ నృత్య కళానిలయం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, గుంటూరు శ్రీ శ్రీనివాస చైతన్య నాట్య కళామండలి వారిచే సత్యహరిశ్చంద్ర నాటకంలోని అడవి సీను, వారణాసి, కాటి సీన్లను అద్భుతంగా ప్రదర్శించారు. ఆదివారం భ్రమరాంబ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించనున్నట్లు ఉపకమిషనర్ తెలిపారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు

# రోడ్డు నిర్మాణంలో నాణ్యత అధ్వానం

- నెల రోజులకే ఒకవక్క కుంగిన రోడ్డు
- రూ.3.50 కోట్లు పెట్టినా ధ్వంసం
- అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కుపై సందేహాలు

**ప్రత్తిపాడు:** ''దాదాపు 20 రోజుల కిందట పడిన వర్షాలకు కొత్త రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. పెద్ద వర్షాల వల్ల రోడ్డు ఇంకా సెట్ అవ్వలేదు. కింద నేల మెతకగా ఉంటే రోడ్డు ఇలాగే కుంగిపోతుంది. అందుకే నెల కూడా అవ్వకుండానే రోడ్డు కుంగిపోయింది. అయినా ఇప్పుడు బయటపడటమే మంచిదైంది. కాంట్రాక్టర్ మెయింటెనెన్స్ చేసే గడువు ఉంటుంది. ఆ సమయంలో వాళ్లే మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. చేయిస్తాం.''... ఇదీ వట్టిచెరుకూరు మండల ఆర్ అండ్ బీ ఏఈ వాదన. ఈ 'మెతక' మాటలు ఇంజినీరింగ్ అధికారుల డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. పనితీరుపై సందేహాలను పెంచుతున్నాయి. కోట్ల రూపాయలు కరిగిపోయాయి. నెల రోజులు కూడా తిరక్కుండానే కొత్త రోడ్డు కుంగిపోయింది. వట్టిచెరుకూరు–ముట్లూరు రహదారి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. వట్టిచెరుకూరు మండలంలో ఎండీఆర్ ప్లాన్ కింద వట్టిచెరుకూరు–ముట్లూరు రోడ్డును సుమారు పది కిలోమీటర్ల మేర రూ.3.50 కోట్లతో నిర్మించారు. నిర్మాణం పూర్తయి ఇంకా పట్టుమని రెండు నెలలు కూడా కాలేదు. ఇంతలోనే నిర్మాణంలోని లోపాలు బయటపడ్డాయి. ఇటీవల కురిసిన అతి కొద్దిపాటి వర్షాలకే రోడ్డు కుంగిపోయి అటు కాంట్రాక్టర్, ఇటు ఇంజినీరింగ్ అధికారుల బాగోతాన్ని వెక్కిరిస్తోంది.

**నాణ్యతపై అనుమానాలు..**

రహదారి నాణ్యతపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపయోగించిన మెటీరియల్ నాణ్యత, పనులు చేసిన విధానం, రోడ్డు కాంపాక్షన్ తదితర అంశాలపై సందేహాలు తలెత్తుతున్నాయి. రూ.3.50 కోట్ల ప్రజాధనంతో చేపట్టిన ఈ పనులు ఎక్కువకాలం మన్నికగా ఉండేలా గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సి ఉంది. రోడ్డు నిర్మాణానికి ముందు బేస్ సిద్ధం చేయడం నుంచి మెటీరియల్ మిశ్రమం, కాంపాక్షన్, తారు పొరల వరకు ప్రతి దశలో నిర్ణీత నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఇవన్నీ సక్రమంగా పాటిస్తున్నారా లేదా అన్నది ఆర్ అండ్ బీ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలి. కానీ, పర్యవేక్షణ కరువవడంతో రోడ్డు ఇలా కుంగిపోయి ఇంజినీరింగ్ శాఖ ఉదాసీనతను వెక్కిరిస్తోంది. కుంగుబాటుకు గల కారణాలను అక్కడక్కడా గుంతలు తవ్వి పైపైన పరిశీలించి చేతులు దులిపేసుకోకుండా, సాంకేతిక నిపుణులు, జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరీక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై వట్టిచెరుకూరు ఆర్ అండ్ బీ ఏఈ ఎస్.కె.ఏ. కెనడీని 'సాక్షి' వివరణ కోరగా, గుత్తేదారుతో మెయింటెనెన్స్ కింద మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. నేల మెతకగా ఉండటం వల్ల రోడ్డు నెల తిరగకుండానే కుంగిపోయిందని తెలిపారు.



ధ్వంసమైన వట్టిచెరుకూరు–ముట్లూరు తారురోడ్డు

# టీడీపీ ఎమ్మెల్యేకు నిరసన సెగ

**సహకరించబోమన్న సీనియర్లు**

- ఇష్టానుసారంగా వ్యవహరిస్తే పార్టీ కోసం పనిచేయాలా అని నిలదీత
- 2029 ఎన్నికల కోసం తాము కూడా వేచి చూస్తామని వెల్లడి
- తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు సీనియర్ల హెచ్చరిక



**పట్నంబజారు:** ''ఎన్నికల్లో మమ్మల్ని వాడుకుని, నమ్మించి మోసం చేశారు. మాకు సీట్లు కేటాయిస్తామని చెప్పారు. రిజర్వేషన్లు మారిన నేపథ్యంలో కనీసం పార్టీ కోసం కష్టపడిన వారికి కూడా సీట్లు కేటాయించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇలాగైతే మేం కూడా పార్టీ అభ్యర్థులకు ఏమాత్రం సహకరించలేమని'' తెలుగుదేశం పార్టీ నేతలు... తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు స్పష్టం చేశారని తెలుస్తోంది. ఇప్పటికే సీట్ల కేటాయింపులో విసిగిపోయిన టీడీపీ క్యాడర్.. ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తున్న అభ్యర్థులకు ఏమాత్రం సహకారం అందించలేమని తేల్చిచెప్పినట్లు సమాచారం. అవసరమైతే కచ్చితంగా వారిని ఓడించేందుకు కృషి చేయాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారని టీడీపీ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది. కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వ్యవహారశైలి టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదు. ఇప్పటికే ఎంతో మంది నుంచి బయోడేటాలు తీసుకున్న ఆయన, అభ్యర్థుల కేటాయింపులో తాత్సారం చేస్తున్నారని, కేవలం తనకు వ్యక్తిగతంగా సహకరించిన వారి పేర్లను మాత్రమే ప్రతిపాదిస్తున్నారని టీడీపీ నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనికి తోడు ఇప్పటివరకు కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేనకు సంబంధించి సీట్ల కేటాయింపులో సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో ఆ పార్టీ నేతలు కూడా ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ఎంతో మందికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ సీట్ల కేటాయింపులో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వద్దకు వెళ్లిన కొంతమంది టీడీపీ నేతలు, 2029 ఎన్నికల కోసం తాము కూడా వేచి చూస్తున్నామని, తామేంటో చూపిస్తామని ఎమ్మెల్యే కార్యాలయంలోనే ప్రత్యక్షంగా హెచ్చరించినట్లు సమాచారం

**మరో వర్గం భేటీ...?**

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వ్యతిరేకంగా ఉన్న మరి కొంతమంది నేతలతో కలిసి, టీడీపీలో కార్పొరేటర్ సీట్లు ఆశించి భంగపడ్డ ఆ పార్టీ సీనియర్ నేతలు భేటీ అయినట్లు సమాచారం. 2024 ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును ఆశించిన ఒక టీడీపీ కుటుంబం.. తమ సోదరుడికి ఒకటో డివిజన్ సీటు అడిగినట్లు తెలుస్తోంది. అయితే, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వారిని ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం బయోడేటా తీసుకుని వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనితో పాటు, ఎప్పటి నుంచో టీడీపీలో కొనసాగుతున్న కాపు సామాజిక వర్గానికి చెందిన నేత చేసిన సిఫార్సులను కూడా ఏమాత్రం లెక్కచేయడం లేదని, ఆయన మనుషులని తెలిస్తే సీటు లేదని చెబుతున్న పరిస్థితులు టీడీపీ నేతలకు ఎదురవుతున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేకు, ఈ నేతలకు ఏమాత్రం పొసగదన్న విషయం బహిరంగ రహస్యమే. ఈ క్రమంలో ఆ ఇద్దరు ముఖ్య నేతల్లో ఒకరు, మరో ముఖ్య నేత కుటుంబ సభ్యులు, కనీస గౌరవం కూడా దక్కని సీనియర్ టీడీపీ నేతలు అంతా భేటీ అయినట్లు సమాచారం. ఎమ్మెల్యే తీరును స్థానికంగా ఉన్న కేంద్ర సహాయ మంత్రి, పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని వారు యోచిస్తున్నారు. నామినేషన్లకు కేవలం ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉండటంతో ఇప్పటికే సీనియర్లు టీడీపీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

# నేటితో ముగియనున్న నామినేషన్ల పర్వం

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే గడువు
- 'నో డ్యూ' సర్టిఫికెట్ల కోసం అభ్యర్థుల పరుగులు.. అధికారుల తీరుపై ఆగ్రహం
- ఇప్పటివరకు 163 నామినేషన్ల దాఖలు.. మేయర్ స్థానానికి 3 నామినేషన్లు
- ఎటూ తేలని పొత్తు పంచాయితీ.. జనసేనలో తీవ్ర అసంతృప్తి

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల ఘట్టం చివరి దశకు చేరుకుంది. నామినేషన్ల దాఖలుకు ఆదివారంతో గడువు ముగియనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లను స్వీకరించనున్నారు. అయితే, దరఖాస్తుల స్వీకరణకు కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఇవ్వడంతో 'నో డ్యూ' ధ్రువీకరణ పత్రాల కోసం ఆశావహులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అన్ని పత్రాలను సమర్పించినప్పటికీ, అధికారులు అదనపు పత్రాలను అడగడంతో అభ్యర్థులు కార్యాలయాల చుట్టూ పరుగులు తీయాల్సి వచ్చింది. మొదటి రోజున కేవలం 8 నామినేషన్లు (టీడీపీ 6, స్వతంత్రులు 2) దాఖలయ్యాయి. శనివారం నగరంలోని 76 వార్డులకు 155 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం నామినేషన్ల సంఖ్య 163కు చేరింది. కాగా, మేయర్ స్థానానికి వైఎస్సార్‌సీపీ నుంచి ఒకటి, అమరావతి పార్టీ నుంచి ఒకటి, స్వతంత్ర అభ్యర్థి తరఫున మరొకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లను ఈ నెల 19వ తేదీన క్షుణ్ణంగా పరిశీలించి, అనంతరం అర్హులైన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరఫున 59, టీడీపీ తరఫున 63, జనసేన తరఫున 20, స్వతంత్రులుగా 14, బీజేపీ తరఫున 4, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ తరఫున ఒక్కొక్కటి చొప్పున నామినేషన్ దాఖలయ్యాయి.

**కూటమిలో విభేదాలు**

మరోవైపు, కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారం జనసేనలో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. నగరంలో కనీసం 20 నుంచి 30 స్థానాల్లో పోటీ చేయాలని జనసేన పట్టుబడుతుండగా, అన్ని స్థానాలను కేటాయించేందుకు టీడీపీ ససేమిరా అంటోందని సమాచారం. దీనిపై స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో జనసేన బలంగా ఉన్న వార్డుల్లోనూ ఇద్దరు, ముగ్గురు చొప్పున నాయకులు ఎవరికి వారే నామినేషన్లు దాఖలు చేశారు. బీ ఫాం ఎవరికి దక్కుతుందో తెలియక అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ పార్టీ టికెట్ నిరాకరిస్తే స్వతంత్రులుగానైనా బరిలో నిలవాలని పలువురు జనసేన నేతలు భావిస్తున్నారు. దీంతో కూటమిలో విభేదాలు బహిర్గతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

### తెనాలిలో 21 మంది నామినేషన్లు దాఖలు

**తెనాలి అర్బన్:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం చివరి దశకు చేరింది. రెండో రోజైన శనివారం చైర్‌పర్సన్ పదవికి ఒకరు, కౌన్సిలర్ల పదవికి 21 మంది తమ నామినేషన్లను దాఖలు చేశారు.

